రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.35	ఉ. 4.44

ఎవరైనా క్షమించి రాజీపడితే దాని ప్రతిఫలం ఇవ్వడం అల్లాహ్ బాధ్యత



పార్లమెంట్‌కు వినూత్న ప్రచారం!

- వివాహ, శుభకార్యాలకు హాజరవుతున్న ఎంపీ అభ్యర్థులు
- సమన్వయ సమావేశాలకే ప్రధాన పార్టీల మొగ్గు
- వివిధ సంఘాల మద్దతును కూడగట్టేందుకు యత్నం
- భారీ ప్రచార ఖర్చులకు అభ్యరుల వెనకడుగు
- నామినేషన్ తర్వాతే ఖర్చుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

నిజామాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వినూత్న రీతిలో ప్రచారాలను నిర్వహిస్తున్నారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో జరిగే అన్ని వివాహాది, శుభకార్యాలకు హాజరవుతున్నారు. సభలు, సమావేశాలకంటే ఎక్కువగా సమన్వయ సమావేశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మండల స్థాయిలో సమావేశాలను నిర్వహిస్తూ ప్రచార జోరును పెంచుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు పార్లమెంట్ పరిధిలో నేతలు, ఇతర వర్గాలను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. భారీ సభల నిర్వహణకు అధిక ఖర్చు కానుండడంతో అభ్యర్థులు ప్రధాన నేతలతోనే సమావేశాలన్నీ నిర్వహిస్తూ మద్దతును కోరుతున్నారు. నామినేషన్ వేసిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించడంతో పాటు నియోజకవర్గాల్లో బహిరంగ సభలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్‌లోని ముగ్గురు బలమైన నాయకులే పోటీలో ఉండటంతో ముందస్తుగా ఖర్చును పెట్టేందుకు వెనకాడుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన ఎంపీ అభ్యర్థులు

ఈ దఫా పార్లమెంట్ ఎన్నికల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ముందే ప్రకటించారు. నోటిఫికేషన్ కన్న ముందే అభ్యర్థులను ప్రకటించడంతో వారు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీ పడుతుండగా బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అర్వింద్ పోటీ పడుతున్నారు. అయితే ముగ్గురు అభ్యర్థులు గత శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు భారీ ఎత్తున ఖర్చు చేశారు. నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించడంతో పాటు నెలన్నర పాటు ఖర్చుకు వెనకాడకుండా గట్టి ప్రయత్నాలు చేసినా ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల నుంచి అనుభవాలను తీసుకున్న ఈ ముగ్గురు పార్లమెంట్ అభ్యర్థులు ఈ దఫా భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అప్పుడు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండి ప్రస్తుతం శాసనసభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాగా కేంద్రంలో ఇంకా బీజేపీ అధికారంలో కొనసాగుతోంది. ఈ దఫా ఎలాగైనా పార్లమెంట్ గెలవాలని ముగ్గురు అభ్యర్థులు గట్టిగా ప్రయత్నాలను చేస్తున్నారు. తమ అనుచర వర్గాన్ని ప్రచారంలోకి దింపారు. గతంలోలాగా గ్రామాల్లో, మండలాల్లో భారీ ప్రచారాలు నిర్వహించకుండా ప్రస్తుతం భిన్నమైన రీతిలో ముందుకు పోతున్నారు. మండల స్థాయిలో జరిగే పార్టీల సమన్వయ సమావేశాలు, కుల సంఘాల సమావేశాలు, వృత్తి సంఘాల సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఆయా సంఘాల సామాజిక వర్గాల మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. ఇవేకాకుండా పార్లమెంట్ పరిధిలో జరిగే మెజార్టీ శుభకార్యాలకు ముగ్గురు అభ్యర్థులు హాజరవుతున్నారు. వీటితో పాటు ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. ధార్మిక కార్యక్రమాల్లో కూడా అభ్యర్థులు పాల్గొంటూ మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు.

కో ఆర్డినేటర్లను నియమించిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలపై బాధ్యతలను పెట్టారు. ప్రచారం నిర్వహించడంతో పాటు అభ్యర్థిని గెలిపించాలని ఆదేశాలు ఇచ్చారు. వీరితో పాటు నియోజకవర్గాలకు సమన్వయం చేసేందుకు కొత్తగా కోఆర్డినేటర్లను నియమించారు. వీరి ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు చేపడుతుండగా అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నియోజకవర్గం పరిధిలో భారీ బహిరంగ సభను నామినేషన్ వేసిన తర్వాత నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

కొనసాగుతున్న బీజేపీ ప్రచారం

ఇదే రీతిలో బీజేపీ అభ్యర్థి అర్వింద్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే జగిత్యాలలో భారీ బహిరంగ సభను నిర్వహించిన ఆయన ఆ తర్వాత అన్ని మండల సమావేశాల్లో పాల్గొంటున్నారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ నేతలతో కలిసి సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో కలిసి ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రచారం

శాసనసభ ఎన్నికల్లో అనుకున్న విధంగా స్థానాలు గెలుచుకోని బీఆర్ఎస్ నేతలు ఈ దఫా ఎలాగైనా నిజామాబాద్ పార్లమెంట్‌ను నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించేందుకు పూర్తిస్థాయిలో ప్రచారాన్ని చేపడుతున్నారు. పార్లమెంట్ పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. నేతలు పార్టీని వదిలి కొంతమంది వెళ్తున్న బలమైన క్యాడర్ ఇప్పటికే ఉండటంతో వారితో సమావేశాలను నిర్వహిస్తూ ముందుకు పోతున్నారు. భారీ ప్రచారాల కన్న సమన్వయ సమావేశాలకే ప్రాధాన్యం ఇస్తూ అన్ని నియోజకవర్గాల్లో జరిగే సమావేశాల్లో పార్టీ అభ్యర్థులు పాల్గొంటున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలి
- అధికారుల సమీక్షలో జిల్లా ప్రత్యేక అధికారి శరత్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఎక్కడా తలెత్తకుండా చూడాలని జిల్లాకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఏఎస్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో తాగునీటిపై అధికారులతో సమీక్షించారు. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండటంతో తాగునీటి కొరత రాకుండా గ్రామాలకు సరఫరా చేయాలన్నారు. ఆయా మండలాల పరిధిలో ప్రత్యేక అధికారులు మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌లు, ఇతర అధికారులు ఏరోజుకు ఆరోజు నీటిపై సమీక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో నీటి నిల్వలను సమీక్షిస్తూ తాగునీటిని అందించాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే అనుమతుల కోసం చూడకుండా ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టాలను సూచించారు. అవసరమైన చోట చేతిపంపులు, బోరుమోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అన్ని వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అవసరమైన చోట్ల వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని అన్నారు. అవిలేని చోట ట్యాంకర్లను పెట్టి నీటిని సరఫరా చేయాలని కోరారు. అద్దె ట్యాంకర్ల విషయంలో ప్రతి అంకాన్ని జాగ్రత్తగా చేపట్టాలన్నారు. శ్రీరాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల్లో నీళ్లు ఉండటం వల్ల తాగునీటికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. అధికారులు బృందాలుగా ఏర్పడి వాట్సాప్ గ్రూపుల్లో సమాచారాన్ని షేర్ చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన కోరారు. కలెక్టరేట్‌లో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి మిషన్ భగీరథ నీటిపై ప్రతిరోజూ సమీక్షించాలన్నారు. నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రత్యేక అధికారులను నియమించాం : కలెక్టర్

జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. మున్సిపల్‌లో కమిషనర్లు, గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పర్యవేక్షణ జరిపే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 33 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 792 నివాస ప్రాంతాలు ఉండగా వాటిలో 37 గ్రామాల పరిధిలో నీటి కొరత ఉందని గుర్తించామన్నారు. వీటి కోసం ప్రత్యమ్నాయ చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. బోరు మోటార్లు, హ్యాండ్ పంప్‌ల రిపేర్ చేయడంతో పాటు నీటి సరఫరా జరిగే విధంగా చూస్తున్నామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడడం వేసవి దృష్ట్యా మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, తహసీల్దార్లు, ఎంపీడీవోల సెలవులను కూడా రద్దు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఆయన కోరారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వం మొత్తం 856 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అవసరమైన ఏర్పాట్లను చేసిందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అన్ని రకాల సదుపాయాలను సమకూర్చడంతో పాటు ఏగ్రేడ్ ధాన్యాన్ని క్వింటాలుకు 2203 రూపాయలకు, సాధారణ రకాన్ని 2183 రూపాయలకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా 80 శాతం కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇవేకాకుండా మెప్మా, ఐకేపీ ద్వారా మిగతా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ధాన్యం అమ్మకాల్లో తరుగు తీసిన ఇంకా ఏవైనా సమస్యలు సృష్టించిన తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఏర్పడితే జిల్లా పౌరసరఫరాల శాఖ, జిల్లా సహకార శాఖ అధికారుల దృష్టికి వెంటనే తీసుకువస్తే పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, లింగం పాల్గొన్నారు



ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటగా అరటి తోటను సాగు చేస్తున్న బోధన్ రైతులు

ఆయిల్‌పామ్‌కు ఆదరణ

- పంటల సాగుకు మొగ్గుచూపుతున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడులు
- ఆయిల్ పామ్ అంతర పంటలతో మరింత ప్రయోజనం
- జిల్లాలో 5వేల ఎకరాల వరకు పంట సాగు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4: జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. పంట సాగుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. విదేశాలలో మాత్రమే పండే ఈ పంటకు ఇక్కడి రైతులు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. పనిలో పని ఇందులోనే అంతర పంటలు వేసుకుని ఆదాయం గడిస్తున్నారు. ఆకు కూరలు, కూరగాయలు, కర్బూజ, మిర్చి, అరటి, వేరు శనగ, మొక్కజొన్న, పత్తి వంటి పంటలను సాగు చేస్తూ ప్రయోజనం పొందుతున్నారు. అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న పామోలిన్‌ను స్థానికంగానే ఉత్పత్తి చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంతో జిల్లాలో ఆయిల్ పామ్ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాతే ఈపంట చేతికి రానుండగా ఈ లోగా రైతులు అంతర పంటలను వేసుకుంటున్నారు.

బోధన్ డివిజన్‌లో 2వేల ఎకరాలకు పైనే సాగు

బోధన్ డివిజన్‌లో సుమారు 2వేల ఎకరాలకు పైగానే ఆయిల్ పామ్ పంటను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 5వేల ఎకరాల వరకు పంట సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. బోధన్, సాలూర, ఇతర మండలాల్లో సాగునీటి సౌకర్యం భూముల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. మండలంలోని శ్రీనివాస్ నగర్, హున్స, మందర్నా, మినార్‌పల్లి, కల్దుర్కి, సిద్ధాపూర్, పెగడాపల్లి, రెంజల్, నీలా, తాడ్‌బిలోలి, మట్టయ్య ఫారం, కోటగిరి, ఎక్లాస్‌పూర్, ఎడపల్లి, జైతాపూర్, ఎత్తొండ, రుద్రూర్, రాయకూర్‌లతో పాటు జిల్లాలో అధికంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటి అంతర పంటలను పండిస్తున్నారు. కొన్ని చోట్ల మూడేళ్ల క్రితం సాగు చేయగా మరికొన్ని చోట్ల గత ఏడాదే చేపట్టారు. డ్రిప్ సిస్టంతో మొక్కలకు సాగు నీరు అందిస్తూ పలువురు రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో చెట్లు ఏపుగా ఎదుగుతున్నాయి. ఒకటి రెండు చోట్ల ఆయిల్ పామ్ గెలలు వేయగా అధికారుల సూచనల మేరకు రైతులు మొదటి మూడేళ్ల వాటిని తీసేసి నాలుగో ఏటా నుంచి ఉత్పత్తి కోసం ఎదురు చూస్తున్నారు.



ప్రత్యామ్నాయ ఆదాయం కోసం

ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం చెట్టుగా మారి కాపు వచ్చే వరకు నాలుగేళ్ళ పడుతుందని బోధన్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి వహీద్ జమ్మా అన్నారు. నాలుగేళ్ల పాటు ఆయిల్ పామ్‌లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని ఈ క్రమంలో ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో అధికారులు వివిధ రకాల పంటల సాగు మొదలు పెట్టారు. కొంతమంది కూరగాయలు, ఆకు కూరలు, కర్బూజా సాగు చేస్తుండగా మరి కొందరు అరటి, వేరు శనగ, మిర్చి, మొక్కజొన్న ఇతర వాణిజ్య, వ్యాపార పంటలు సాగు చేస్తున్నారు. ఇంకొందరు రైతులు మాత్రం ఆయిల్ పామ్‌లో కొద్దిపాటి భూమిలో తీగజాతి కూరగాయలు, కర్బూజ, కొత్తిమీర, ఆకు కూరలు పండిస్తున్నారు.

మరింత పోత్సాహించాలంటున్న రైతులు

జిల్లాలో సుమారు 5వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలనే టార్గెట్ ఉందని ఉద్యాన శాఖ అధికారి సంధ్యారాణి ఈ సందర్భంగా వివరించారు. అధికారులు ఎంత అవగాహన కల్పించిన పలువురు రైతులు మొగ్గు చూపకపోవడంతో లక్ష్యానికి దూరంగానే ఆయిల్ పామ్ పంట ఉండిపోయిందన్నారు. అన్ని పంటలు సాగు చేస్తే మూడు నుంచి ఆరు నెలల్లో దిగుబడులు వచ్చి ఆదాయం సమకూరుతుండగా దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్‌తో సాగు చేసిన నాలుగేళ్ల అనంతరం ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల పాటు ఆయిల్ ఫామ్ గేలలు ఉత్పత్తి కానుండడంతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం రానున్నప్పటికీ లక్ష్యం మేరకు సాగు కావడం లేదు. ఆయిల్ పామ్ సాగు చేసి న రైతులు అధిక శాతం అంతర పంటలు వేస్తున్నారు.

ప్రభుత్వం ప్రతి ఎకరా ఆయిల్ పామ్ పంట సాగుకు మెంటనెన్స్ 2100రూపాయలు అంతర పంటల సాగుకు మరో 2100రూపాయలు చెల్లిస్తుంది. అన్ని రకాల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం మరింత ప్రోత్సాహకాలు అందించాలని రైతులు కోరుతున్నారు. ఎకరాకు 10వేల సహాయం అందిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని, మరికొందరు రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వస్తారని కోరుతున్నారు.

ఆయిల్ పామ్‌సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనం..

: సంధ్యారాణి, జిల్లా ఇన్‌చార్జి ఉద్యానవన శాఖ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుంది. నీటి సౌకర్యం ఉన్న భూముల్లో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుంది. సుమారు మూడు దశాబ్దాల పాటు గెలలు వేయడంతో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చు.

ఈ నెల 10, 24 తేదీల్లో సదరం క్యాంపులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈనెల 10, 24 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి 1గంటల వరకు సదరం క్యాంపులను నిర్వహించనున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న ఉదయం 11.30 గంటల నుంచి మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. మీసేవ రసీదు నందు సూచించిన స్థలం, తేదీ రోజున హాజరుకావాలని తెలిపారు. ఏప్రిల్ 2024కు సంబంధించి రెండు సదరం క్యాంపులకు గాను ఐదు వికలాంగత్వ కేటగిరిల కింద మొత్తం 260 సదరం స్లాట్‌లను విడుదల చేశామన్నారు. మెడికల్ రిపోర్టులు, ఎక్స్‌రే, ఎంఆర్, సిటీస్కాన్, వినికిడి లోపం గలవారు బీరా టెస్టు రిపోర్టును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఒక వ్యక్తి సహాయంతో వెళ్లవచ్చని సదరం సర్టిఫికెట్ రిన్యూవల్ ఉన్నవారు ఓల్డ్ సదరం సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత మెడికల్ రిపోర్టులను తప్పనిసరిగా తీసుకురావాలని, గడువు లోపు రినివల్ చేసుకోవాలని లేదంటే ఆసరా పెన్షన్లు నిలిపివేయబడుతాయని ఆయన తెలిపారు.

ఎస్సెస్సీ స్పాట్‌కు హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు

- 58 మందికి షోకాజ్ నోటీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: పదో తరగతి మూల్యాంకనం 2024కు సంబంధించి స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించబడిన వారు తప్పనిసరిగా మూల్యాంకనం కేంద్రంలో శుక్రవారం ఉదయం 8గంటలలోపు రిపోర్టు చేయాలని లేదంటే వారిపై యాక్ట్ 25/1997 కింద శాఖాపరమైన చర్యలు తీసుకోబడుతాయని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిపోర్టు చేయని వారిని ఎటువంటి నోటీసు లేకుండా విధుల నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. ఈమేరకు 58 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సమ్మెటివ్-2 పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి సమ్మెటివ్-2 పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేశారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ రాధారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటవ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 8 నుంచి జరగవల్సిన పరీక్షలను 15వ తేదీకి వాయిదా వేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈనెల 15 నుంచి 19 వరకు, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 15 నుంచి 22 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 23 ఈవిద్యా సంవత్సరానికి చివరి రోజు కావున ఆరోజే విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వనున్నారు.

వృత్తి ప్రొఫెసర్.. ప్రవృత్తి 'మత్తు' తయారీ!

● ఇంటర్‌పోల్ పోలీసుల అరెస్టుతో బహిర్గతమైన టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ బాగోతం

● విధులకు గైర్హాజరైనా పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు



డిచ్‌పల్లి, ఏప్రిల్ 4: తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్దొళ్ల శ్రీనివాస్ వృత్తి పరంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌అయినా ఆయన ప్రవృత్తి మాదక ద్రవ్యాల తయారీపై పడింది. తెలంగాణ వర్సిటీలోని ఓ అధ్యాపకుడు నిషేధిత మాదక ద్రవ్యాల తయారీ కేసులో అరెస్టు కావడం స్థానికంగా కలకలం రేపింది. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన అధ్యాపకుడు డ్రగ్స్ వ్యాపారంలో పోలీసుల అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అధ్యాపకుడు శ్రీనివాస్ వ్యవహార శైలి వర్సిటీలో తొలి నుంచే వివాదాస్పదంగా ఉండేది. విధులకు సరిగా రాకుండా.. ఏదో తుతూ మంత్రంగా వర్సిటీకి వచ్చేవాడని విద్యార్థి సంఘాలు నాయకులు ఆరోపిస్తున్నారు. వర్సిటీలో పనిచేసే అధ్యాపకులకు ఐదేళ్ల సీనియారిటీ ఉంటే డిప్యూటేషన్‌పై ఇతర సంస్థల్లోకి వెళ్లి పని చేసేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ అధ్యాపకుడు శ్రీనివాస్ మాత్రం ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లకే గత వీసీని ప్రసన్నం చేసుకొని డిప్యూటేషన్‌పై వెళ్లాడు. అది నుంచి వివాదాస్పదంగా ఉన్న శ్రీనివాస్ హైదరాబాద్ శివారులో మెడికల్ ల్యాబ్‌సంస్థలో మేనేజింగ్ పార్ట్‌నర్‌గా కొనసాగుతున్నాడు. ఇలాంటి నిషేధిత వ్యాపారంలో కొనసాగుతున్న శ్రీనివాస్‌ను వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. యూనివర్సిటీలో ఉద్యోగిగా ఉంటూ నిషేధిత డ్రగ్స్ తయారీ చేస్తూ గత నెల 22న శ్రీనివాస్ అరెస్ట్ అయిన విషయం 4రోజుల క్రితం వర్సిటీ రిజిస్ట్రార్ దృష్టికి రావడంతో శ్రీనివాస్ గత మార్చి వేతనం నిలిపివేశారు. కానీ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అరెస్ట్ అయితే 48గంటల్లో సస్పెండ్ చేయాల్సి ఉన్నా శ్రీనివాస్‌పై వర్సిటీ అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. కాగా శ్రీనివాస్‌పై కేసు నమోదు ఎఫ్ఆర్ఐ కాపీ తనకు ఇంతవరకు అందలేదని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొనడం గమనార్హం.

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత

జక్రాన్‌పల్లి, ఏప్రిల్4: మండలంలోని తొర్లికొండ గ్రామంలో కొండపై నూతనంగా నిర్మించనున్న వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. గుగరువారం గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి అభినందన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్3: పట్టణంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో క్రీడాకారిణి సౌజన్యను గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ సవిత అభినందించారు. మార్చి 27నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన అండర్-14 జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని జట్టుకు ప్రథమ స్థానంలో నిలిపి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి సౌజన్యను పాఠశాల పిజికల్ డైరెక్టర్ స్వప్న, పీఈటీ భాగ్యలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో చలివేంద్రం ప్రారంభం

ఏర్గట్ల, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని కార్యదర్శి జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు, దూర ప్రాంతాలకు వెళ్ళే మహిళలకు, వాహనదారులకు వేసవి దాహార్తి తీర్చేందుకు తాగు నీరు అందుబాటులో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జీపి సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మి కెనాల్ ఆయకట్టు రైతులకు
ఆఖరితడి వరకూ సాగునీరు ఇవ్వాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్ 4: ముప్కాల్ మండలంలోని లక్ష్మి కాలువ ఆయకట్టు కింద ఉన్న పంటను బతికించుకునేందుకు లక్ష్మి కెనాల్ ద్వారా నీటివిడుదల కొనసాగించాలని శ్రీరాం సాగర్‌ప్రాజెక్టు ఎస్ఈ, సీఈలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం కోరారు. ఈ సందర్భంగా రైతుల వినతి మేరకు రోజుకు 400 క్యూసెక్కుల చొప్పున 10రోజుల పాటు (0.3టీఎంసీ)ల నీటిని చివరి తడికింద విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులతో ఎన్నిసార్లు విన్నవించుకున్నా వినకుండా ప్రభుత్వం నీటి అలకేషన్ లేని ప్రాంతాలను వరదకాలువ ద్వారా నాలుగు టీఎంసీల నీటిని కిందకు విడుదల చేశారు. అలకేషన్ ఉన్న లక్ష్మీకాలువకు, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి లిఫ్టుకు, నవాబ్ లిఫ్టుకు ఆయకట్టులోని రైతులు సాగునీరు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తోంది.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4: యువత మత్తు పదార్థాలను వీడి స్వామి వివేకానంద సూచించిన మార్గంలో నడవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రధాన వక్త నర్ర వెంకట శివకుమార్ అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యువత అనుకున్న లక్ష్యాలు చేరాలంటే చెడుమార్గాలకు లోనుకావద్దన్నారు. జాతీయవాద స్ఫూర్తితో ప్రతీఒక్కరు ముందుకు సాగలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అంటే క్రమశిక్షణతో కూడుకున్నదని, అన్నారు. విద్యార్థులు సమయపాలనతో మెలిగి ఎన్నో విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ గుప్తా, ఖండకార్యవహభూషన్ జిల్లా సహవ్యవస్థాపక ముఖ్ గంగారెడ్డి, సాయికుమార్, శ్రవణ్, చందు, సంతోశ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మానాల మోహన్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఏర్గట్ల, ఏప్రిల్4: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మైనార్టీ సోదారులు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు ఆడెపు గంగాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి రవి, రొక్కెడ సంజీవ్, మునీరోద్దీన్, యూసుఫ్, మైనార్టీలు పాల్గొన్నారు.

● మోర్తాడ్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న సునీల్‌కుమార్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మోర్తాడ్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లీంలకు అతిపెద్దపండగా విశిష్టతను ఆయన వివరించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గడ్డం అశోక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గిర్మాజీగోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, అశోక్, కపిల్, గిర్మాజీ గంగాధర్, ముస్లీం మజీద్ కమిటీ పెద్ద మనుషులు, ముస్లీంలు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డిచ్‌పల్లి, ఏప్రిల్4: 44వ జాతీయ రహదారి పక్కన అనాథశవం పడి దుర్వాసనగా రావడంతో డిచ్‌పల్లి పోలీసులు ఆ శవాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని నడిపల్లి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్‌కు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ సమాచారం అందజేశారు. స్పందించిన పంచాయతీ సిబ్బంది రాము, సంతోశ్, శాంసన్, బాబా, నర్సయ్య, రాజేశ్, దుర్గవ్వ కలిసి అనాథశవాన్ని ట్రాక్టర్‌లో స్మశాన వాటికకు తీసుకెళ్లి జేసీబీతో పూడ్చివేయించారు.

ఇసుక పాలసీపై అధికారులకు అవగాహన

జక్రాన్‌పల్లి, ఏప్రిల్4: ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతి కోసం ప్రభుత్వం రూపొందించిన ఇసుక పాలసీపై అధికారులు అవగాహన కల్పించారు. గురువారం జక్రాన్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం కొత్త పాలసీపై సమావేశం నిర్వహించారు. కొత్త ఇసుక పాలసీపై తహసీల్దార్ కిరణ్మాయి, అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్ఐ ప్రవీన్, పోలీసులు, పంచాయతీకార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

డొంకేశ్వర్ ఏప్రిల్4: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీవో కిరణ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని సిర్పూర్, అన్నారం గ్రామాల్లో ఎంపీవో కిరణ్ పర్యటించారు. నీటి ట్యాంకుల చుట్టూ మొరంపోసి చదును చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి ట్యాంకులను పరిశీలించారు. పంచాయతీ వాటర్ వర్క్, సెవెన్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు మౌనిక, విగ్నేష్, కారోబార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీవో కిరణ్

మూడేళ్లుగా నిర్మాణంలోనే..

● కొనసా..గుతున్న వెజ్ మరియు నాన్‌వెజ్ మార్కెట్ సమీకృత భవనం పనులు
● రోడ్డుపైనే వ్యాపారుల క్రయవిక్రయాలు ● ప్రారంభానికి నోచుకునేదెన్నడో..?



అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవనం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 4: 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది భీమ్‌గల్ పట్టణ మున్సిపాలిటీ దుస్థితి. భీమ్‌గల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా 7 డిసెంబరు 2021న పట్టణ నడిబొడ్డున ఉన్న పాత రెవెన్యూ శాఖ కార్యాలయ ఆవరణలోని స్థలంలో సుమారు రూ.2కోట్లతో సమీకృత వెజ్ మరియు నాన్‌వెజ్ మార్కెట్ భవననిర్మాణ పనులను బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నిక లకు ముందుగానే భవనం ప్రారంభోత్సవం ఉంటుందని అందరూ భావించారు. భవనం నిర్మాణానికి అవసరమైన నిధులున్నా ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదన్న ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

● ముచ్చటగా మూడేళ్లు..

భీమ్‌గల్‌పట్టణంలో ఎన్నో ఏళ్లుగా మార్కెట్ యార్డ్ లేక కూరగాయలు, మాంసం, చేపల విక్రయదారులు నడిరోడ్డుపైనే సుమంగళి చౌరస్తా వద్ద, మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో విక్రయాలు కొనసాగిస్తుంటారు. ప్రతీ సోమవారం నిర్వహించే సంత కూడా రోడ్డుపైనే కొనసాగుతోంది. మార్కెట్‌యార్డ్ పూర్తికాకపోవడంతో విక్రయదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనే అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా విక్రయాలు జరుపుతున్న చిరు వ్యాపారులకు మున్సిపాలిటీ సిబ్బంది వారికి నూతన మార్కెట్ భవనంలో గదుల నెంబర్లను కేటాయించారు. ఇప్పటికీ నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా వంద పడకల ఆసుపత్రి, మార్కెట్‌యార్డ్ భవనాల అవసరాలను అప్పటి ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీ పాలకవర్గం గుర్తించారు. ఎన్నో ఏళ్లుగా మార్కెట్ యార్డ్ లేక భీమ్‌గల్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 'పేరుకే మున్సిపాలిటీ.. అభివృద్ధి మాత్రం శూన్యం అన్నట్లు మారింది భీమ్‌గల్ పట్టణ పరిస్థితి. ఇప్పటికైనా కోట్లలో ఆదాయం ఉన్నా భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రజాప్రతినిధుల అలసత్వంతో మూడేళ్ల క్రితం ప్రారంభించిన సమీకృత భవనం పనులు సగం కూడా పూర్తి కాలేదు. నామమాత్రపు గదుల నిర్మాణం చేసి సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా త్వరితగతిన వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం పనులను పూర్తిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు పెంచాలి



ఆసుపత్రిలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 3: ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెంచాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో డివిజన్ స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మాతా శిశు సంరక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ చేయించుకోవాలని సూచించారు. ఏరియా ఆసుపత్రిలో 24 గంటలు ప్రసూతి సేవలు అందుతాయని వివరించారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సమీక్షలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి, సీహెచ్‌వో కృష్ణమూర్తి, ఆసుపత్రి వైద్యులు నాగరాజు, స్రవంతి, అపర్ణ, గీత, అధికారులు సాయి ఉన్నారు.

7న జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాలలో ప్రవేశపరీక్ష

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 4: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9, 10 తరగతులలో ప్రవేశానికి ఈనెల 7న పరీక్ష పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి పరీక్ష ఈనెల 7న ఉదయం 10గంటలకు ఉంటుందని, 7, 8, 9, 10తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం మధ్యాహ్నం 2గంటలకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్ష విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు గంట ముందు అనుమతించడం జరుగుతుందన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రర్

మోర్తాడ్, ఏప్రిల్4: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిష్ట్రర్ శ్రీనివాస్ అన్నారు. కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని విక్రయించి లబ్ధిపొందాలని సూచించారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్, పాలెం, ఒడ్యాట్, మోర్తాడ్ గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మానిటరింగ్ అధికారి నర్సింగ్‌రావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని కోరారు. ఏ గ్రేడ్ వరికి రూ.2203, బీ గ్రేడ్ వరికి రూ.2183 రైతులు ప్రభుత్వం అందిస్తున్న ధరలకు విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కల్లెం అశోక్‌రెడ్డి, కార్యదర్శి కాశీరాం, రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గిరిజన మోర్చా పార్లమెంట్ జిల్లా కన్వీనర్‌గా గంగాధర్

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్4: బీజేపీ గిరిజన మోర్చా పార్లమెంట్ నిజామాబాద్ కన్వీనర్‌గా కొర్ర గంగాధర్‌ను నియామిస్తూ గురువారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొర్ర గంగాధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను నిస్వార్థంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కిసాన్‌మోర్చ మాజీ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అనిల్, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పెండింగ్‌లో ఉన్న
స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్4: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రియాంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన నుంచి ఇప్పటి వరకు సరైన విధంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ రాక అనేక అవస్థలకు గురవుతున్నారని, చదువుకోవడానికి భారంగా ఉందని, కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. విద్యావ్యతిరేక విధానాలు అవలంబిస్తే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏరియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్నుపై 5శాతం తగ్గింపు

● మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 3: మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులు చెల్లింపుపై 5శాతం తగ్గింపు ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్‌గా ఇంటి పన్నులు చెల్లిస్తున్నా వారికి ఐదు శాతం తగ్గింపు ఉందని, ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

మాక్లూర్, ఏప్రిల్4: మండలంలోని బోర్గం(కె) గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు వేసినట్టు పశువైద్యాధికారులు డాక్టర్ ఉమ మసాహెర్, డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 773 పశువులకు టీకాలు వేసినట్టు తెలిపారు.



బోర్గం(కె)లో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

మాక్లూర్, ఏప్రిల్4: మండలంలోని బీరప్ప ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కుర్మ సోదరులు ఇలాంటి పండగలు జరుపుకోవడం ఆనందదాయకమని, ఎలాంటి సహాయ, సహకారాలు అవసరమున్నా తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్షత్రీయ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలో ఎంపికైన ఇంజనీరింగ్ విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్4: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్యూస్పైడర్ హైదరాబాద్ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు యామిని, శ్రావ్య, ప్రియాంకకోలార్ నియామక ప్రక్రియ కొనసాగించారు. 133మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వీరికి అటిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కర్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. మూడ్ రౌండలలో ప్రతిభనుచూపిన 22మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ రాకేష్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పున్నయ్య

డిచ్‌పల్లి, ఏప్రిల్4: తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా.పున్నయ్య, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా డా.మోహన్‌బాబు, సహాయ కార్యదర్శులు డా.బాలకిషన్, డా.నీలిమా, కోషాధికారిగా డా.నాగరాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వివేక్, అశోక్‌వర్ధన్ తెలిపారు. గురువారం నిర్వహించిన ఎన్నికలలో పరిశీలకురాలిగా డా.కిరణ్మాయి వ్యవహరించారు. ప్రమాణస్వీకారం అనంతరం నూతన కార్యవర్గం రిజిస్ట్రార్ యాదగిరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏర్గట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఏర్గట్ల, ఏప్రిల్4: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసామాధికారి అబ్దుల్ మాలిక్ తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్‌తో కలిసి ప్రారంభించారు. ఏ గ్రేడు రూ.2203, బీ గ్రేడు రూ.2183 పొందాలని సంఘం సీఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.




కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో

వైభవంగా సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

● పాల్గొన్న జగద్గురు శంకరచార్య విద్యారణ్యభారతి స్వామి

మాక్లూర్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని హంపీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరచార్య విద్యారణ్య భారతిస్వామి చేతుల మీదుగా నిర్వహించారు. ఆలయ గోపురాన్ని అమర్చిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొనగా వేదపండితుల మధ్య కుంకుమార్చనతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి శ్రీలక్ష్మణ సాహిత సీతా రామాంజనేయస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేష్‌గుప్తా, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, సర్పంచ్ అశోక్‌రావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జైశ్రీరాం అంటూ నినాదాలు చేయగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జోక్యం చేసుకొని ఆలయం వద్ద రాజకీయం చేయవద్దని వారిని అక్కడి నుంచి పంపించివేశారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరాగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటూ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మంత్రాలు ఉచ్చరిస్తున్న శంకరచార్య విద్యారణ్యభారతిస్వామి



గుడి గోపురాన్ని అమరుస్తున్న దృశ్యం

సకాలంలో ధాన్యం డబ్బులు జమ చేయాలి

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు జమ చేసేలా ట్యాబ్ ఆపరేటర్లు రైతుల వివరాలు వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వహకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్యాబ్ ఆపరేటర్లు బాధ్యతాయుతంగా రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్నారు. వెంటవెంటనే వివరాలను నమోదు చేసి రైతులకు తొందరగా డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, డీసీవో చంద్రప్రకాశ్, డీఎం సివిల్ సప్లై జగదీశ్వర్, డీపీఎం సాయిలు, ఏపీఎం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

ముత్తకుంట సొసైటీలో కొనుగోళ్లు ప్రారంభం

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని ముత్తకుంట సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. సొసైటీ పరిధిలోని ముత్తకుంట, గాంధీనగర్, కొత్తపేట, లింగితండా, మల్కాపూర్ తండాల్లో సొసైటీ కార్యదర్శి నంబూద్రీలు ప్రారంభించారు.

నాగేపూర్‌లో ..

నవీపేట: మండలంలోని నాగేపూర్‌లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో వినోద్ ప్రారంభించారు. నాగేపూర్ సొసైటీ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రమేష్, నీలం సాయిలు, సురేందర్ తదితరులున్నారు. అలాగే నవీపేటలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని నవీపేట సొసైటీ కార్యదర్శి మహేష్ తెలిపారు. స్థానిక సొసైటీ ఆవరణలో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


కండువా వేస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి

మోస్రా, ఏప్రిల్ 4: మోస్రా మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో వర్ని ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ పిట్ల గంగాధర్ కుమారుడు పిట్ల హరీష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సూర్య, లక్ష్మణ్, పిట్ల శ్రీకాంత్, కేశవులు, పిట్టల సంతోష్, మహేష్, శంకర్, సాకలి ప్రసాద్, షాదుల్లా, గంగాధర్ గౌడ్, సిరాజ్, భూమాగౌడ్, ఆరేపల్లి స్వామిగౌడ్, తిమ్మాపూర్ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా వేసి ఏనుగు రవీందర్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, గ్రామ అధ్యక్షులు నర్సారెడ్డి, కిసాన్ ఖేత్ అధ్యక్షులు తోటరాజు, మండల ఉపాధ్యక్షులు ఎంటికల శంకర్ పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభం

రుద్రూరు: మండలంలోని సులేమాన్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, ఎంపీటీసీ గౌస్, గ్రామ పార్టీ అధ్యక్షులు హైమద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డిగ్రీ విద్యార్థులు

ధర్పల్లి, ఏప్రిల్ 4: రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు మండల కేంద్రంలోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. హైదరాబాద్ ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో అస్తిత్వం కోల్పోయిన చిందూ కళారూపం - ఒక పరిశీలన అనే అంశంపై కళాశాల విద్యార్థులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి పోటీలో పాల్గొన్న 15 ప్రాజెక్టుల్లో ధర్పల్లి కళాశాల విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టు ఉండటం సంతోషకరమని ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు మహిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినిలు శ్రీయ, మైతిలి, అర్చన, ఐశ్వర్య, శివాత్మిక, ప్రవీణలు అద్భుతంగా రాణించారన్నారు.

మోడల్ స్కూల్ పరీక్షలకు బందోబస్తు

ఖిల్లా, ఏప్రిల్ 4: ఈనెల 7న జరిగే మోడల్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్ష కోసం అన్ని రకాల ఏర్పాట్లను చేశామని నగర పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష 6,7,10వ తరగతి సీట్ల కోసం జరుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు. అన్ని కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు సందర్భంగా నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ప్రాంతంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ షాపులను నిలిపివేయాలని పోలీసులను ఆయన కోరారు. అన్ని కేంద్రాల వద్ద ప్రశాంతంగా పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఇంజెక్షన్ వికటించి బాలుడి మృతి

పెద్దబజార్, ఏప్రిల్ 4: కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇవ్వడంతో ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీసులకు బాధిత కుటుంబీకులు గురువారం ఫిర్యాదు చేశారు. ధర్పల్లి మండలానికి చెందిన 10 నెలల బాలుడు గత నెలలో అస్వస్థతతో గురికాగా ఖలీల్‌వాడిలోని చిన్నపిల్లల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. ఐదు రోజులు వైద్యం చేసిన అనంతరం బాలుడి ఆరోగ్యం మెరుగైందని చెప్పారు. తీరా డిశ్చార్జ్ చేసే సమయంలో మీడాజోలం 10ఎంబీ ఇంజెక్షన్ ఇచ్చారు. ఆ తర్వాత బాలుడు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించాలని సదరు ఆసుపత్రి వైద్యులు సూచించారు. హైదరాబాద్‌కు తరలించే సమయంలో బాలుడు మృతి చెందాడు. తీరా కుటుంబీకులకు అనుమానం వచ్చి ఇంజెక్షన్ గురించి ఆరా తీయగా ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే గడువు ముగిసినట్లు గుర్తించారు. అనంతరం ఈ విషయం కలెక్టర్‌తో పాటు ఒకటవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించేందుకు ఒకటవ టౌన్ పోలీసులు నిరాకరించారు. మరోవైపు విషయాన్ని గుర్తించిన ఆసుపత్రి యాజమాన్యం తమకు తప్పుడు బిల్లులు వివరాలు ఇచ్చారని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్పందించి పూర్తి విచారణ జరిపించాలని కోరుతున్నారు.

పసుపుబోర్డు మీద రాజకీయం చేస్తున్నారు

● బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి

పెద్దబజార్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పసుపు బోర్డు మీద రాజకీయం చేస్తున్నారని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాలు పరిపాలన చేసి ప్రజల్ని మోసం చేసిందన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎన్నికల కోసం అబద్ధాలు చెప్పడం సరైందికాదన్నారు. నిజామాబాద్ పార్లమెంటరీలో పసుపుబోర్డు ఎక్కడ ఇస్తారో బోర్డు ప్రతినిధులు, అధికారులు ఆలోచిస్తారని అన్నారు. పసుపు బోర్డు గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు పదే పదే మాట్లాడటం సరికాదన్నారు. పసుపు బోర్డు గురించి రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేశారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, ఆకుల హేమలత, సుమిత్రదేవి, పంచరెడ్డి లావణ్య, వనిత, ఆకుల శ్రీనివాస్, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: నగరంలోని సీతారంనగర్ కాలనీలో ఓ ఇంటిపై 5వ టౌన్ పోలీసులు దాడి చేశారు. ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 5వ టౌన్ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిర్వహకుడితో పాటు ఇద్దరు విటులను, ఐదుగురు మహిళలను గుర్తించారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి మహిళలను సఖీ కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఈద్గాను పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూరు, ఏప్రిల్ 4: మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం రుద్రూరు మండల కేంద్రంలో నిర్మించిన ఈద్గాను పరిశీలించారు. ఈద్గాను చాలా అందంగా సుందరంగా నిర్మించిన మైనారిటీ సోదరులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీలు షేక్ సుభాని, ఎం.డి. జమీల్, ఎక్బాల్, బాబు, మహమూద్, ఫారుక్, బాసిత్, జాకీర్, దస్తగిరిలు ఉన్నారు.




స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు

వైభవంగా స్వామివారి చక్రస్నానం

మోపాల్, ఏప్రిల్ 4: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శ్రీ దేవనాథ జియర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి సమక్షంలో వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. గురువారం 6వ రోజు కావడంతో యాగశాలలో మహా పూర్ణాహుతి, అనంతరం భక్తులనుద్దేశించి దేవనాథ జియర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజస్వామి ప్రవచనాలు చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు మహాపూర్ణాహుతి, స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని దేవనాథ జియర్‌స్వామి, గంగోత్రి స్వామి, వేదిపండితులు, అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేలాది పూలతో శ్రీపుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవనాథ జియర్‌స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాసు స్వామి ప్రవచించారు. కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి దంపతులు, శిరీష్‌రెడ్డి దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు, హరీష్ దంపతులు, సుదర్శన్‌రెడ్డి దంపతులతో పాల్గొన్నారు. ఎంపీటీసీ రాములు, గంగాధర్, రవీందర్ యాదవ్, నరేందర్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రమేష్, భాస్కర్, సురేందర్, రాజేశ్వర్, సాయిలు, గంగారెడ్డి, ప్రమోద్, సురేష్, రవి, భూంరెడ్డి, యజ్ఞాచార్యులు సత్యనారాయణ, శ్రీకరచార్యులు, రోహిత్‌కుమాచార్యులు, విజయస్వామి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో బాలుడి మృతి


అఖిల్ (ఫైల్)

ఇందల్వాయి, ఏప్రిల్ 4: ఐదేళ్ల బాలుడు వడదెబ్బతో మృతి చెందిన ఘటన జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని డొంకల్ తండా గ్రామానికి చెందిన రమావత్ అఖిల్ (5) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. తండ్రి రమేశ్ గల్ఫ్‌లో ఉండగా.. తల్లి అనిత వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. రోజూలాగే గురువారం కూడా అఖిల్ పాఠశాలకు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం ఇంటికి తిరిగొచ్చాక కాసేపు ఎండలో ఆడుకున్న అఖిల్.. వడదెబ్బతో కళ్లు తిరిగి పడిపోయాడు. సాయంత్రం వేళ ఇంటికి వచ్చిన తల్లి అనిత.. కింద పడి ఉన్న అఖిల్‌ను చూసి వెంటనే నిజామాబాద్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చింది. అయితే అప్పటికే అఖిల్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అప్పటివరకు తమతో పాటే ఉన్న అఖిల్.. అంతలోనే చనిపోవడాన్ని చూసి తట్టుకోలేక తల్లితో పాటు కుటుంబీకులు చేసిన రోదనలు చూపరులతో కంటతడి పెట్టించాయి.

విశ్రాంత ఉద్యోగులకు కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4: బోధన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మెడివిజన్ కంటి ఆసుపత్రి నిర్వాహకులచే మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలన్నారు. గురువారం 40మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 10మందికి ఆపరేషన్ నిమిత్తం రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వివేకానంద కాంస్య విగ్రహానికి భూమిపూజ

కోటగిరి, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వివేకానంద కాంస్య విగ్రహానికి భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన శ్రీరామకృష్ణ మఠం స్వామిజీ సంతోష్ మహరాజ్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. నెల రోజుల్లో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద పాఠశాల యాజమాన్యం శివ, శ్రీనివాస్, రజిని, హన్మంత రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాంకాలనీలో బాల సాహిత్య వేదిక ఏర్పాటు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 4: జిల్లా కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీలో ఈనెల 5న ఆదివారం సాయంత్రం 5 గంటలకు "బాల సాహిత్య వేదిక" ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాలల్లో సాహిత్య స్పృహను పెంపొందించడానికి, వారిలో దాగిన సృజనాశక్తిని వెలికితీయడానికి జిల్లా స్థాయిలో బాల సహిత్య వేదిక ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గుండారం జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి ఈ సాహిత్య వేదికను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా బాలల రచనలు, బాల సాహిత్య ప్రక్రియలో పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.


వెంకటేశ్వర ఆలయంలో మాస కల్యాణం దృశ్యం

గోవింద నామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4: కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి నిత్యం గోవింద నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని వెంకటేశ్వర ఆలయ వేద పండితులు తెలిపారు. గురువారం ఆలయంలో స్వామి వారికి మాస కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హిందువులు ప్రతిరోజూ ఆలయ ప్రదక్షిణ చేయాలని అరిష్టాలు తొలగి అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని వేద పండితులు అన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మాస కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పబ్బ మురళీ, వెంకటేశ్వర్ రావు, హరిబాబు పాల్గొన్నారు.

విరాళం అందజేత

వర్ని, ఏప్రిల్ 4: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో నిర్మాణంలో గల శ్రీరామ మందిరంకు గురువారం ఎంపీటీసీ సావిత్రి 21వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. చరణ్ అనే వ్యక్తి రూ.5116 విరాళంను అందించారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి సురేందర్, ఇత్తెం బాలు, సీహెచ్ గంగాధర్, వెంకటి పాల్గొన్నారు.

ఈ నెల 20 నుంచి అఖండ శివనామ సప్తాహ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఏప్రిల్4: అఖండ శివనామ సప్తాహతో సకల శుభాలు కలుగుతాయని, ఈ నెల 20వ తేది నుంచి వచ్చే నెల 27వ తేదీవరకు అఖండ శివనామ సప్తాహ నిర్వహిస్తున్నట్లు వీరశైవ సమాజ్ ప్రముఖులు వెంకటేశ్వర్ రావు దేశాయ్, శ్యామ్‌రావులు అన్నారు. గురువారం వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో 19వ అఖండ శివనామ సప్తాహ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివనామ సప్తాహ చాలా పవిత్రమైనదని ఏడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అర్చనలు, అభిషేకాలు, పరమరహస్య గ్రంథ పారాయణం, మంగళహారతులు, బ్రహ్మ పీఠాధిపతి ప్రవచనలు, కీర్తనలు, భజనలు ఉంటాయన్నారు. వీరశైవ సమాజ్ బంధువులందరు అధిక సంఖ్యలో పాల్గొన్నాలన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ అప్ప, నర్సింగ్ అప్ప, లక్ష్మణ్ పటేల్, రాజేందర్, కర్నె హన్మంత్ రావు, శంకరప్ప, యాదవరావు, విఠల్, శివ, పురాణే దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

నవీపేట,ఏప్రిల్4: మండలంలోని పొతంగల్, నాగేపూర్‌లలో గురువారం చలి వేంద్రాలను ఎంపీవో రామకృష్ణ ప్రారంభించారు. ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌ల వద్ద ఈ చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో రామకృష్ణ మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందులో భాగంగా గురువారం పొతంగల్, నాగేపూర్‌లలో ఈ చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పొతంగల్ పంచాయతీ కార్యదర్శి నరేష్, నాగేపూర్ పంచాయతీ కార్యదర్శి మనోహర్, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలో గురువారం చలి వేంద్రం కేంద్రాన్ని తహసీల్దార్ మోతిసింగ్ ప్రారంభించారు. సత్యనారాయణపురం గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో ఈ చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని ఎండ వేడి నుండి కాపాడేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, పోలీసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమావేశం

మోపాల్, ఏప్రిల్ 4: తెలంగాణ ఉత్తర విద్యుత్ సంస్థ ఆపరేషన్ సబ్ డివిజన్ నిజామాబాద్ రూరల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఠాణాకుర్దు గ్రామంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఎస్.రామకృష్ణ, ఎల్.కిషన్, ఎం.రాజాగౌడ్‌లు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ బాలేష్, డీఈ ఉత్తమ్, బాబాశ్రీనివాస్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల మధ్య గొడవ

● ఒకరికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేర్ల అనిల్

ఎడపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని జానకంపేట గ్రామంలో గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఒకరికి గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబదించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జానకంపేట గ్రామంలోగల మద్యం దుకాణం వద్ద గురువారం రాత్రి మద్యం తాగుతున్న ఇద్దరు వ్యక్తుల మధ్య మాట మాట పెరిగి తగాదాకు దారి తీసింది. ఈ గొడవలో రమేష్ గౌడ్ అనే యువకుడు షేర్ల అనిల్ అనే యువకుడిపై గాజు సీసాతో దాడికి దిగాడు. ఈ వివాదంలో గాయపడ్డ అనిల్ అనే వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడ్డ రమేష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకుని అల్లరి మూకలను చెదరగొట్టారు. బాధితుని చిన్నాన్న షేర్ల భూమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4: సాలూర మండలంలోని ఖాజాపూర్ వాగులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ నాగనాథ్ తెలిపారు. మృతదేహం నీటిలో ఉండడం వల్ల కుళ్లిపోయి గుర్తు పట్టలేనంతగా మారిందన్నారు. మృతుడు నీలిరంగు జీన్స్ ప్యాంటు, నలుపు రంగు బెల్టు వేసుకున్నాడని, 35సంవత్సరాల వయసు ఉంటుందని ఆయన తెలిపారు. ఎవరైనా మృతదేహన్ని గుర్తు పడితే బోధన్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన శ్రీరాం శంకర్(60)అనే వ్యక్తి బుధవారం ఉదయం పట్టణంలోని సాత్‌పుట్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయ్యాడన్నారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బోధన్ పట్టణ సీఐ వీరన్న తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,900	రూ.65,400	రూ.820

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (11.45, 3.10, 6.35, 10.00)
- స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (11.20, 2.00)
  : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (4.40, 7.20, 10.00)
- స్క్రీన్-3 : టిల్లు స్క్వేర్ (10.30, 1.30, 7.40, 10.40)
  : భరతనాట్యం (4.55)
- స్క్రీన్-4 : క్రూ (హిందీ) (10.30, 1.20, 7.35)
  : ఫ్యామిలీ స్టార్ (4.10)
  : భరతనాట్యం (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (10.25, 1.30, 4.35, 7.40, 10.45)
- స్క్రీన్-2 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 4.40, 10.30)
  : గాడ్జిల్లా అండ్ కాంగ్ (7.45)
- స్క్రీన్-3 : భరతనాట్యం (1.40)
  : టిల్లు స్క్వేర్ (7.35)



- దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహల్: ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
- నటరాజ్ : భరతనాట్యం (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్